


జ్ఞాపకాలు అనుభవాలు



కదం తొక్కిన అంగన్‌వాడీలు

జనవరి 3: గౌరవ వేతనం రూ.26 వేలు, పదవి విరమణ తరువాత రూ.10 లక్షలు ఇవ్వాలనే డిమాండ్లతో అంగన్‌వాడీలు కార్య కర్తలు కదం తొక్కారు. కర్నూలు, నంద్యాల కలెక్టరేట్‌ను ముట్టడించారు. అంతకు ముందు 22 రోజులు రిలే దీక్షలు చేశారు.

దేవరగట్టు కర్రల సమరం



అక్టోబరు 13: దేవరగట్టులో దసరా విజయ దశమి ఉత్సవాల్లో భాగంగా బన్ని జైత్రయాత్ర మహోత్సవం (కర్రల సమరం) నిర్వహించారు. ఈ ఉత్సవంలో 79 మంది గాయపడ్డారు. కర్రల సమరం చూసేందుకు వచ్చిన ముగ్గురు కర్ణాటక యువకులు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు.





కర్నూలు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):

కాలగమనంలో ఓ వసంతం కరిగిపోతోంది. ఎన్నో తీపి, మధుర జ్ఞాపకాలను 2024 సంవత్సరంలో వదిలిపోతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనకు అంతం పలికి... కూటమి ప్రభుత్వానికి స్వాగతం పలికిన ఏడాదికి ఈరోజే ఆఖరు. గడిచిన 12 నెలల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నో సంఘటనలు మరెన్నో మధురానుభూతుల... ఇంకెన్నో సంగతులు, కీలక ఘట్టాలు. నిన్నటి ఘనతలు స్మరించుకూంటూ గతించే ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. కోటికాంతులతో వికసించే 2025 సంవత్సరం ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో ఆహ్వానం పలుకుతున్న వేళ.. 2024 మిగిల్చిన కీల సంఘటనల, అనుభవాల సమాహారమే ఈ అక్షర రూకపం.



- మదిలో పదిలపరుచుకున్న మధుర జ్ఞాపకాలెన్నో..
- మిగిల్చిన చేదు అనుభవాలు..
- 2024కు వీడ్కోలు పలుకుతూ..
- కొంగొత్త ఆశలతో 2025 నవ వసంతంలోకి అడుగులు వేస్తూ...

తూర్పున చంద్రబాబు.. పశ్చిమాన భువనేశ్వరి



జనవరి 8: ఆళ్లగడ్డలో రా కదలిరా..! సభలో అధినేత చంద్రబాబు, కోడుమూరులో నిజం గెలవాలి..! అంటూ నారా భువనేశ్వరి దంపతులిద్దరు ఒకే రోజు ఉమ్మడి కర్నూలులో పర్యటించారు. 28న పత్తికొండ రా కదలిరా..! సభలో చంద్రబాబు పాల్గొన్నారు.. తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపారు.

జగన్‌పై చెల్లి షర్మిల నిప్పులు



జనవరి 29: రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కర్నూలులో పర్యటించిన వైఎస్ షర్మిల అన్న జగన్ పాలనపై నిప్పులు చెరిగారు.

జూలై 7: నందికొట్కూరు నియోజకవర్గంలోని ఓ గ్రామంలో 8 ఏళ్ల చిన్నారి అదృశ్యం అయ్యింది. అత్యాచారం చేసి హత్య చేశారని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో ఓ నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు.



మే 11: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదోని పట్టణంలో పర్యటించారు.

మే 11 : నంద్యాలో రాజ్ థియేటర్ సర్కిల్‌లో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చివరి రోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జగనన్న భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించారు.

జూన్ 4: ఓటరన్న తీర్పు వెలువడిన రోజు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలు సహా 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతం ఎగుర వేసింది. 1985 తరువాత 40 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టింది. రెండు స్థానాలతో వైసీపీ సరిపుచ్చుకుంది.

జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పాటుగా ఉమ్మడి జిల్లా నుంచి నంద్యాల, బనగానపల్లె, కర్నూలు ఎమ్మెల్యేలు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి, టీజీ భరత్‌లు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.



ఓటర్ల తీర్పు

మే 13: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు తీర్పు ఇచ్చిన రోజు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 76.45 శాతం ఓటర్లు ఓట్లు వేశారు.



పారిశ్రామిక శోభ

జూలై 23: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్-2024-25 ప్రసంగంలో తీపి కబురు చెప్పారు. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక్కడికి జపనీస్ సంస్థ సెమికండక్టర్ పరిశ్రమతో పాటు డ్రోన్ తయారీ పరిశ్రమలు రాబోతున్నాయి.

కృష్ణమ్మకు జలహారతి

జూలై 31: సీఎం చంద్రబాబు శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. రికార్డు స్థాయిలో 1,573 టీఎంసీల వరద శ్రీశైలం డ్యాంకు చేరింది. తరువాత మరమ్మతులకు ఫేజ్-1 కింద రూ.102.58 కోట్లు మంజూరు చేశారు.



శ్రీశైలానికి సీప్లేన్



నవంబరు 9: శ్రీశైలం పాతల గంగలో సీప్లేన్ ల్యాండ్ అయ్యింది. విజయవాడ నుంచి శైలంకు సీప్లేన్‌లో సీఎం చంద్రబాబు ప్రయాణించారు. దేశంలో సీప్లేన్ టూరిజానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు.

అక్టోబరు 17: కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో యురేనియం అంచనాల్లో భాగంగా 68 బోర్లు తవ్వకాలకు కేంద్ర అటవి శాఖ అనుమతి ఇవ్వడంతో యురేనియం కలకలం రేపింది. సేవ్ కప్పట్రాళ్ల..! అంటూ 15 గ్రామాలు రోడ్డెక్కారు. పది రోజులకు పైగా ఆందోళన చేశారు. దిగివచ్చిన ప్రభుత్వం అనుమతి ఉప సంహరించుకుంది.





కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు

ఆగస్టు 10: రాయలసీమ జీవనాడి తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ చైన్‌లింక్ తెగిపోయి కొట్టుకుపోయింది. సీఎం చంద్రబాబు తక్షణమే ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్స్ నిపుణుడు కన్నయ్యానాయుడును పంపించి స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి 30 టీఎంసీలు కడలిపాలు కాకుండా కాపాడారు.

అల్లు అర్జున్‌పై కేసు నమోదు

మే 11 : సినీ హీరో అల్లు అర్జున్, నంద్యాల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డిపై నంద్యాల రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ జనసమీకరణలో పాల్గొన్నట్లు అప్పట్లో ఆయనపై కేసు నమోదు కావడం సంచలనమైంది.



అమిత్ షా రాజీనామా చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

ఎమ్మిగనూరు , డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. సీపీఎం 23వ కర్నూలు జిల్లా మహాసభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన సోమవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రితోపాటు బీజేపీలో ఎవరికి రాజ్యాంగం పట్ల, అంబేడ్కర్ పట్ల గౌరం లేదని అన్నారు. వారికి మనుధర్మ శాస్త్రంపై మాత్రమే నమ్మకం ఉందని విమర్శించారు. బీజేపీ వల్ల రాజ్యాంగానికి నష్ట వాటిల్లుతుందని, దీని ద్వారా రిజర్వేషన్లు, రాష్ట్రాల హక్కులు సెక్యులరిజానికి, సమాజానికి నష్ట కలిగించే పరిణామాలన్నారు. దీంతో రాజ్యాంగాన్ని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను గౌరవించలేని అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఎం, సీపీఐ వామపక్ష పార్టీలు ఉద్యమించనున్నాయని తెలిపారు. ఇప్పటికే సీపీఎం, సీపీఐ, వామపక్ష పార్టీలతోపాటు దళిత సంఘాలు మద్దతిచ్చాయన్నారు. రాష్ట్రం విభజన తరువాత, జిల్లాల విభజన తరువాత అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలే అన్నారు. గతంలో అనంతపురం ఉమ్మడి జిల్లా వెనుకబడి ఉండేదని, అయితే ఆ జిల్లాకు కియా ఫ్యాక్టరీ, హంద్రీనీవా జలాలు రావటంతో ఉపాధి, పండ్ల తోటలు పెంపకం పెరగటంతో అక్కడ పరస్థితి మారిందన్నారు. కర్నూలు జిల్లా మీదుగా తుంగభద్ర నదీజలాలు సముద్రం పాలవుతున్నా జిల్లాలో అనేక ఎకరాలకు సాగునీరు అందించలేక పోతున్నారన్నారు. జిల్లాలో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందన్నారు. దీంతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతం ప్రజలు నిత్యం వలస బాటపడుతున్నారని పేర్కొన్నారు. ఆరు నెలల గ్రామాల్లో ఉంటే మరో ఆరు నెలలు ఇతర ప్రాంతాల ప్రజలుగా జీవించాల్సి వస్తుందన్నారు. 78 ఏళ్ల స్వాతంత్రం తరువాత కూడా వలసలు వెళ్తున్నారంటే ఈ రాష్ట్రాన్ని పాలించిన పాలకులు, ఈ జిల్లా ప్రయోజనాల కోసం ఏమాత్రం పని చేశారో తెలుసుకోవాలని అన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల సాధన, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ కల్పనకు, వలస నివారణకు తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలు చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, రాధాకృష్ణ, గోవిందు, హనుమంతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాల నియంత్రణకు సంబంధించి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు వీలుగా డివిజన్, మండల గ్రామ స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయి కమిటీలో ఏఎన్ఎం, పంచాయతీ సెక్రటరీ, వీఆర్వోలను నియమించాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్.1972ను ప్రారంభించిందని, ఈ నెంబరు గురించి అవగాహన కల్పించే విదంగా హోర్డింగులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను సూచించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో నివారించడానికి టోల్‌ఫ్రీ నెంబర్.1972ను కేటాయించాన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీటీసీ శాంత కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డీఈవో శ్యామ్యూల్ పాల్, డీఎంహెచ్‌వో శాంతిలత, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. 2,39,818 పింఛన్లకు సంబంధించి 102.55 కోట్లు మంజూరయ్యాయి. నూతన సంవత్సరం-2025 జనవరి ఒకటో తేదీకి ముందు రోజే పింఛన్‌దారులకు పింఛన్లు ఇవ్వనున్నారు.



వివరాలు 6లో

సీఐల పదోన్నతి జాబితా సిద్ధం

కర్నూలు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సీఐల పదోన్నతికి రంగం సిద్ధమైంది. డీఎస్పీలుగా పదోన్నతి పొందేందుకు అర్హులైన సీఐల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 155 మంది పేర్లతో కూడిన సీఐల జాబితాను ఆయా జిల్లాలకు పంపారు. కర్నూలు రేంజ్ పరిధిలో 40 మంది సీఐలు డీఎస్పీలుగా పదోన్నతి పొందే జాబితాలో ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న వారి సమగ్ర వివరాలు పంపాలని డీజీపీ ఆదేశించారు. వారిపై ఉన్న ఏసీబీ కేసులు, సస్పెన్షన్లు తదితర వివరాలతో కూడిన సమగ్ర వివరాలు పంపాలని డీజీపీ ఆదేశించారు. ఈ జాబితా ప్రకారం సుమారు 50 నుంచి 60 మంది దాకా సీఐలు డీఎస్పీలుగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. జనవరి 10వ తేదీలోపు వారి వివరాలు పంపాలని డీజీపీ ఆదేశించారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి సోమవారం వచ్చే అర్జీలే కాకుండా సీఎంవో నుంచి డిప్యూటీ సీఎం, మంత్రులు తదితర మార్గాల ద్వారా దరఖాస్తులు వస్తున్నాయని, వాటన్నింటినీ ప్రాధాన్యతా వారిగా వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే మిస్సింగ్ సిటిజన్స్ పీఏసీఎస్‌సర్వే లాంటి 4, 5 అంశాలపై ఎంపీడీవోలతో ప్రతిరోజూ సమీక్ష చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కొండయ్య పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

అర్జీదారులకు వసతులు ఏర్పాటు చేయాలి

అర్జీలు ఇచ్చేందుకు వచ్చే అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అర్జీదారుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, అర్జీ కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లను పరిశీలించారు. అర్జీదారులు కూర్చునేందుకు మరిన్ని చైర్లను ఏర్పాటు చేయాలని డీఆర్వోను ఆదేశించారు. వికలాంగుల కొరకు ఏర్పాటుచేస్తున్న ర్యాంపులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రెవెన్యూకు సంబంధించి వివిధ రకాల అర్జీలు వస్తుంటాయని, వాటిని సంబంధిత సబ్జెక్టు, ఆప్షన్ల కింద సక్రమంగా నమోదు చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు.

మల్లన్న సేవలో ప్రముఖులు

శ్రీశైలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ కుటుంబ సమేతంగా కలసి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయంలోనికి ప్రవేశించి రత్నగర్భ గణపతి స్వామిని దర్శించుకుని స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని దర్శించుకున్నారు. అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆమెకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో శ్రీనివాసరావు

టమోటా ధర పతనం

- 30 కేజీల బాక్స్ రూ. 60
- రవాణ ఖర్చులకు సరిపడని ధర
- అప్పుల బాధలో రైతు



టమోటా పొలం

గోనెగండ్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా టమోటా రైతు పరిస్థితి దయనీయంగా మారింది. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. దరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడి కూడా చేతికి అందక అప్పులు పాలు వావాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎంతో ఆశతో రైతులు టమోటా సాగు చేశారు. సాగు ప్రారంభంలో దరలు బాగా ఉండటంతో కంటికి రెప్పలా పంటను కాపాడుకున్నారు. పంట చేతికి అందే సమయానికి ధరలు పూర్తిగా పడిపోయాయి. ఎమ్మిగనూరు మార్కెట్ లో 30 కేజీల బాక్స్ ధర రూ. 60 నుంచి రూ. 70 లోపే ధర పలుకుతోంది. దీంతో రవాణా ఖర్చులు, పెట్టుబడులు కూడా చేతికి అందేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. గోనెగండ్ల నుంచి ఎమ్మిగనూరుకు బాక్స్‌కు రూ. 20 ఆటో చార్జి, మార్కెట్ దగ్గర హమాలీ కూలీ, కమీషన్ అంతా కలిపి బాక్స్‌కు మరో రూ. 20 పడుతుంది. మొత్తం ఒక బాక్స్‌కు రూ. 40 పోగా రైతు చేతికి బాక్స్ అమ్మితే రూ. 20 చేతికి అందుతుంది.



ఎమ్మిగనూరు మర్కెట్‌కు వ్యాన్‌లో తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టమోటా బాక్స్‌లు

2000 ఎకరాల్లో టమోటా సాగు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో దాదాపు బావులు బోర్లు కింద 2వేల ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. ఎకరం పంట పెట్టుబడికి దాదాపు రూ. 50 వేల నుంచి 55 వేల వరకు ఖర్చు అవుతుంది.

దిగుబడి ఉన్నా ధర లేదు



నేను ఐదున్నర ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశాదు. ఎకరాకు రూ. 50వేల వరకు పెట్టు బడి పెట్టాను. దాదాపు రూ. 3 లక్షల ఖర్చు వచ్చింది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నది. కోత కూలీలకు రూ. 250 నుంచి రూ. 300 వరకు ఇవ్వాలి. సోమవారం ఎమ్మిగనూరు మార్కెట్‌లో 70 బాక్స్‌లు అమ్మితే కూలీ డబ్బులు కూడా రాలేదు. మరో రూ. 2000 అప్పు చేయాల్సి వచ్చింది.

- గొల్ల శివన్న, టమోటా రైతు గోనెగండ్ల

ప్రభుత్వం టమోటా రైతును ఆదుకోవాలి

టమోటా ధర పలకడం లేదు. రైతుల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ధర లేక పోవడంతో చాలా మంది రైతులు పొలంలోనే పశువులకు మేతగా వేస్తున్నారు. భారీగా పెట్టుబడి పెట్టి సాగు చేస్తే కూలీ డబ్బులు కూడా రావడం లేదు. ప్రభుత్వం టమోటాకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.



కేజి రూ. 10 ప్రకారం గ్రామాల్లో తిరిగి అమ్మకాలు జరుపుతున్న వ్యాపారి

పత్తికొండ మార్కెట్‌లో టమోటా

పత్తికొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్‌లో సోమవారం టమోటా ధర తగ్గుముఖం పట్టింది. నిన్న మొన్నటి వరకు కిలో కనిష్ఠం రూ8, గరిష్ఠంగా రూ.15 దాకా పలికింది. కాగా సోమవారం రూ.5 నుంచి రూ.12 చొప్పున వ్యాపారులు టమోటాను కొనుగోలు చేశారు. కాగా ఎర్రగా పండిన టమోటాలను వ్యాపారులు మొదట 10 కిలోల జత గంపలు రూ.50కి కొన్నారు. మార్కెట్ యార్డు అధికారులు వ్యాపారులతో మాట్లాడి రూ.100కు కొనుగోలు చేయించారు. కాగా దోరగా మాగిన టమోటాను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసినా వారితో మాట్లాడి రైతుకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ యార్డు కార్యదర్శి కార్నలీస్ తెలిపారు.

మహానందీశ్వరుని మాన్యం కబ్జా

- పట్టాదారు పాసు పుస్తకాలతో పంట రుణాలు పొందిన వైనం
- స్వాధీనం చేసుకుంటామంటున్న ఆలయ ఈవో



తమ్మడపల్లి పొలాల్లో కబ్జాకు గురైన మహానందీశ్వరుని భూమి

మహానంది, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూములను పరిరక్షించాల్సిన అధికారే కాజేసేందుకు పన్నాగం వేశాడు. రూ.కోట్ల విలువ చేసే భూములను ఇతరులకు కట్టబెట్టెందుకు సహాయ సహకారాలు అందించాడు. రెండు సంవత్సరాల క్రితం స్వామి వారి ఆలయ భూములను కొందరు తమవే అంటూ రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నారు. దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి చొరవతో ఈ వ్యవహారం బయట పడింది. నంద్యాల జిల్లాలో పేరు ప్రఖ్యాతలు గాంచిన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు దాదాపు వంద సంవత్సరాల క్రితం స్వామి వారికి దాతలు భూములు ఇచ్చారు. మహానంది మండల పరిధిలోని తమ్మడపల్లి గ్రామ పొలిమేరలో సర్వే నెంబర్ 314లో ఎకరా 14 సెంట్లు, సర్వే నెంబర్ 303లో 8 ఎకరాల 74 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారు. తమకు వంశపార్యపరంగా వస్తున్నట్లు రెవెన్యూ రికార్డులో పేర్లను నమోదు చేయించుకొని ఏకంగా పట్టాదారు పాసుపుస్తకాలను పొందారు. ఇందుకు గతంలో పని చేసిన మహానంది దేవస్థానం ఆలయ ఈవోతో పాటు పాలకమండలి చైర్మన్ సహకారం ఉన్నట్టు తెలుస్తోంది. అంతేగాకుండా ఓ ప్రజాప్రతినిధి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కూడా ఎలాంటి విచారణ చేపట్టకుండా గుడ్డిగా పాసుపుస్తకాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో మహానందీశ్వరుని మాన్యం భూములతో పట్టదారు పాసుపుస్తకాలు పుట్టించుకున్న వ్యక్తులకు బ్యాంకు రుణాలు సైతం మంజూరైనట్టు తెలుస్తోంది. సామాన్య రైతులు పాసుపుస్తకాల కోసం కార్యాలయం వెళితే చెప్పులు అరిగేలా తిప్పుకునే రెవెన్యూ అధికారులు మహానందీశ్వరుని భూములను ఇతరులకు కట్టబెట్టడంపై చర్చనీయాంశంగా మారింది.

మాన్యం భూములను స్వాధీనం చేసుకుంటాం

మహానందీశ్వర స్వామికి చెందిన మాన్యం భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఊరుకునేది లేదు. మహానంది ఆలయానికి చెందిన రెండు సర్వే నెంబర్లలో ఉన్నటు వంటి భూములను కొందరు అనుభవిస్తూ వాటికి ఏకంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందినట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో సర్వే చేయించి భూమిని గుర్తించాంది. త్వరలో స్వాధీనం చేసుకొని మహానంది భూములుగా రికార్డుల్లో నమోదు చేయిస్తాం.

-ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి



తమ్మడపల్లిలో కబ్జాకు గురైన మాన్యం భూముల్లో సర్వే చేస్తున్న రెవెన్యూ, దేవస్థానం అధికారులు

వానరానికి పోలీసుల అంత్యక్రియలు

కర్నూలు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన వానరానికి కర్నూలు వన్‌టౌన్ పోలీసులు అంత్యక్రియలు చేశారు. పాత నగరంలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో కరెంటు తీగలు తగిలి వానరం మృతి చెందింది. అందరూ చూస్తూ అయ్యో పాపం అంటున్నారే గానీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితుల్లో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు తాయన్న, ప్రకాష్ రెడ్డి, రఘులు కలిసి ఆ వానరాన్ని శ్మశాన వాటికకు తరలించి హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు.



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

8న జంతు సంక్షేమ బోర్డు బృందం రాక

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి జనవరి 8వ తేదీన భారత జంతు సంక్షేమ బోర్డు (యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా) బృందం రానున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. సోమవారం గార్గేయపురం డంపు యార్డులోని కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా కొద్ది నెలల క్రితం నిలిచిపోయిన శునకాల ఆపరేషన్లను పునఃప్రారంభించేందుకు అనుమతి కోసం నగర పాలక, భారత జంతు సంక్షేమ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. జనవరి 8న భారత జంతు సంక్షేమ బోర్డు బృందం నగరానికి వచ్చి గార్గేయపురం డంపు యార్డులో ఉన్న కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తుందని కమిషనర్ తెలిపారు. అనుమతులు మంజూరైతే ప్రతి రోజూ 20 శునకాలను ఆపరేషన్ల ప్రక్రియ పునఃప్రారంబిస్తామన్నారు. మరో 15 శునకాల ఆపరేషన్లకు సంబంధించిన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, త్వరలో పనులుపూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గంగాధర్, వెటర్నరీ డాక్టర్ మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు 190 మంది ఎంపిక
- అమావాస్య కావడంతో పలువురు గైర్హాజర్



100 మీటర్ల పరుగుపందెం

కర్నూలు క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహ దారుఢ్య పరీక్షలు సోమవారం మొదటి రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు ఎస్పీ జి. బిందుమాధవ్ హాజరై పరీక్షలను ప్రారంభించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 280 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతీ వంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం వీరికి ఫిజకల్ ఎఫిషియన్సీ టెస్టులు, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 240 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. 208 మంది అర్హత సాదించారు. 100 మీటర్ల పరుగులో 208 అభ్యర్థులు పాల్గొనగా 134 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 208 మంది అభ్యర్థులు పాల్గొనగా 187 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు మొదటి రోజు 190 మంది అర్హత సాధించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 10,143 మంది అభ్యర్థులు ఉన్నారన్నారు. ప్రతి రోజు 600 మంది అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షల్లో పాల్గొంటారన్నారు. ఏదేనా సమస్యపై అప్పీలు చేసుకునే వారు రిక్వెజిషన్ రాసి ఇచ్చి జనవరి 28న అప్పీలుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్‌పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అమావాస్య కావడంతో.. ఈ పరీక్షలకు సుమారు 300 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలుస్తున్నది.



పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ



అభ్యర్థులకు జియో ట్యాగ్ అమర్చుతున్న పోలీసులు

నేడు కర్నూలులో 30 పోలీసు యాక్టు

కర్నూలు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం పోలీసు 30 యాక్టు అమలులో ఉంటుంది. జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని డీఎస్పీ బాబు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో పోలీసుల నియమ నిబంధనలు పాటించాలన్నారు. 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనంతరం పలు ఆంక్షలు, సూచనలు చేశారు.

నూతన వేడుకల్లో పోలీసుల ఆంక్షలు

- కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుంది.
- మద్యం తాగి వాహనాలు నడిపితే.. మోటారు వాహనాల చట్టం 185 ప్రకారం, నేరం, ఇందుకు రూ.10 వేలు జరిమానా, లేక 6 నెలల జైలు శిక్ష ఉంటుంది.
- డ్రైవింగ్ లైసెన్సు 3 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు లేదా శాశ్వతంగా సస్పెండ్ చేస్తారు.
- మద్యం షాపులు ప్రభుత్వం అనుమతించిన సమయం వరకే తెరిచి ఉంచాలి.
- మైనర్లు వాహనాన్ని నడపరాదు. వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.
- ద్విచక్రవాహనాల సైలెన్సర్లు తీసివేయరాదు. సైలెన్సర్లు తీసి వాహనాలను నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.
- వాహనాలను అధిక వేగంతో, ప్రమాదకర డ్రైవింగ్, ప్రజా ప్రదేశాల్లో రేసింగ్ చేయడం మోటారు వాహనాల చట్టం సెక్షన్ 183, 184 ప్రకారం శిక్షార్హులు
- వేడుకల పేరుతో మహిళల పట్ల, ఇతర వాహనదారులపట్ల అసభ్యకరంగా, అమర్యాదగా ప్రవర్తించకూడదు.
- శుభాకాంక్షలు చెప్పాలనే నెపంతో ఈవ్ టీజింగ్, స్నాచింగ్ చేసే అవకాశాలు ఉంటాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానితులు ఉంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలి



నూతన సంవత్సర వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ బాబు ప్రసాద్

- ఎవరైనా నూతన సంవత్సర వేడుకలు, కార్యక్రమాలు నిర్వహించదలిస్తే ముందుగా కర్నూలు ఎస్‌డీపీవో అనుమతి తీసుకోవాలి. అటువంటి వారికి రాత్రి ఒంటి గంట వరకు షరతుల మేరకు అనుమతి ఉంటుంది.
- రోడ్లపైన ట్రాఫిక్ జామ్ చేసి, కేకులు కట్ చేయకూడదు. అలా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి. డీజేలకు పర్మిషన్లు లేవు
- రోడ్లపైన బారికేడ్లు, డివైడర్స్‌గానీ, రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలను డ్యామేజీ చేస్తే వారిపై చట్టపరమైన శిక్షలు ఉంటాయి.
- రోడ్లపైన, జంక్షన్లలో ఎలాంటి టపాసులు పేల్చరాదు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి
- సీపీఎం జిల్లా మహాసభలో పలు తీర్మానాలు
- ముగిసిన 23వ సభలు



సభలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన పార్టీ ప్రతినిధులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో జరుగుతున్న సీపీఎం కర్నూలు జిల్లా 23వ మహాసభలు సోమవారం స్థానిక సోమప్ప మెమోరియల్ హాల్‌లో రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు ఎగురవేశారు. అమరవీరుల స్థూపం దగ్గర నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయటంతో పాటు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని మహాసభ తీర్మానించింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వలసలు నివారించాలని, మహిళలపై దాడులు అరికట్టాలని, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి భద్రత కల్పించాలని మహాసభ తీర్మానించింది. అలాగే జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి చేయటం, ఐటీ, ఫార్మా, కంపెనీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. దళితక్రైస్తవులను ఎస్సీలుగా కొనసాగించాలని, వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని, ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని తీర్మానించింది. మహాసభ అధ్యక్షవర్గంగా పీ. నిర్మల, టీ రాముడు, లక్ష్మన్న వ్యవహరించారు. సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రామన్న, జిల్లా నాయకులు రాధాకృష్ణ, గోవిందు, హనుమంతు, రాముడు పాల్గొన్నారు.



సీపీఎం జెండాను ఎగురవేస్తున్న జిల్లా నాయకులు రామాంజనేయులు

సీపీఎం జిల్లా కార్యదర్శిగా గౌస్ దేశాయ్ ఎన్నిక : మహాసభ 26మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నది. జిల్లా కార్యదర్శిగా రెండోసారి డీ గౌస్ దేశాయ్‌ని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా పీ నిర్మల, జి రామకృష్ణ, కే వెంకటేశ్వర్లు, కేవీ నారాయణ, ఎండీ అంజిబాబు, ఎండీ ఆనంద్ బాబు, టీ రాముడును ఎన్నుకున్నారు.

వేడుకలకు కాంగ్రెస్ పార్టీ దూరం

నంద్యాల రూరల్/కర్నూలు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనవరి 1న జరిగే న్యూ ఇయర్ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంటుందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహయాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. భారత మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం నేపథ్యంలో ఏపీసీసీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అన్ని నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో నాయకులు జనవరి మూడో తేదీ వరకు మన్మోహన్ సింగ్ సంతాప సభ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంతాప సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యవసాయ కూలీ మృతి

గడివేముల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని కరిమద్దెల గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని నార్త్ 24 పర్గానాస్ జిల్లాలోని దుచ్నికల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు వరి నాట్ల కోసం బండిఆత్మకూరు మండలంలోని రామాపురం వచ్చారు. పార్నపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి పొలంలో వరి నాట్లు వేసేందుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా కరిమద్దెల గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వ్యవసాయ కూలీ సునిల్ సర్దార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

దొర్నిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుపాపల గ్రామంలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. గుండుపాపల గ్రామంలోని బస్‌స్టాప్ వద్ద మురుగు కాలువలో శవం కనిపించడంతో స్థానికులు సమాచారం అందించారని అన్నారు. మృతి చెందిన వ్యక్తి రెండు రోజులుగా ఒంటెలగల, గుండుపాపల గ్రామాల్లో తిరుగుతుండేవాడని స్థానికులు తెలిపారు. మృతికి గల కారణాలను పోలీసు విచారణలో తెలుస్తుందని అన్నారు. మృతుడి ఆచూకీ కోసం 9121101178, 9121101166 నంబర్‌లకు సంప్రదించాలని అన్నారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

ఉయ్యాలవాడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన బుడ్డా విష్ణువర్ధన్‌పై అదే గ్రామానికి చెందిన తరిగోపుల జశ్వంత్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, తులసిరెడ్డిలు దాడి చేసి గాయపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ నూర్‌అహ్మద్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాత కక్షలు మనస్సులో పెట్టుకొని గడ్డి మోపు దించుతున్న తనపై ముగ్గురు ప్లాస్టిక్ పైపుతో కొట్టి గాయపరిచినట్లు విష్ణువర్ధన్ ఫిర్యాదు చేశాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

39 కేజీల గంజాయి ధ్వంసం

నంద్యాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులకు పట్టుబడిన 39.549 కేజీల గంజాయిని సోమవారం ధ్వంసం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలోని డోన్ పట్టణం, ఆళ్లగడ్డ రూరల్, చాగలమర్రి, బండిఆత్మకూరు, కొత్తపల్లి, నంద్యాల త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 17 ఎన్‌డీపీఎస్ కేసుల్లో సీజ్ చేసిన మొత్తం 39.549 కేజీల గంజాయి విలువ రూ.4.74 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయి మొత్తాన్ని నంద్యాల నుంచి అయ్యలూరు రోడ్డుకు పోయే దారిలో విజయపాల డెయిరీ ఎదురుగా జన సంచారంలేని ఖాళీ స్థలంలో అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో మెంబర్ ఆఫ్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ సమక్షంలో ధ్వంసం చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

కనకాద్రిపల్లెలో సైబర్ మోసం

- నిమిషాల్లోనే రూ.25 వేలు మాయం

కొలిమిగుండ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లెలో సోమవారం సైబర్ మోసం జరిగింది. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన యశ్వంత్ అనే వ్యక్తికి ఓ గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాము ఎస్‌బీఐ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. మీరు వాడుతున్న ఎస్‌బీఐ యోనో యాప్ పని చేయడం లేదని, దాన్ని సరి చేయడానికి తాము పంపించే లింక్ ఓపెన్ చేయాలని సూచించారు. దీంతో యశ్వంత్ లింక్‌ను ఓపెన్ చేసి తన సెల్ ఫోన్‌కు వచ్చిన పిన్ నంబరు వారికి తెలిపాడు. కాసేపటికే తన అకౌంట్ చెక్ చేసుకున్న యశ్వంత్ రూ.25వేలు మాయమైనట్లు గుర్తించాడు. పోలీసులను సంప్రదించగా సైబర్ క్రైమ్ కావడంతో నంద్యాల ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించనట్లు తెలిపాడు.

8 నుంచి లా సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో లా 3, 5 సంవత్సరాలకు సంబంధించిన 2,4,6,8,10 సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షల టైం టేబుల్ ప్రకారం జనవరి 8న నుంచి 31 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆయా కళాశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలకు యాక్షన్ ప్లాన్

- కర్నూలు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ కె.సింధు సుబ్రహ్మణ్యం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించడానికి 24 గంటలు అందుబాటులో ఉంటానని కొత్తగా కర్నూలు జీజీహెచ్‌కు నియమితులైన డిప్యూటీ కలెక్టర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కె.సింధు సుబ్రహ్మణ్యం అన్నారు. హాస్పిటల్‌కు వచ్చిన ప్రతి రోగికి వైద్యం అందేలా కృషి చేస్తానన్నారు. కొత్తగా విధుల్లో చేరిన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కె.సింధు సుబ్రహ్మణ్యంతో ఇంటర్వ్యూ వివరాలు..



కుటుంబ నేపథ్యం..

తండ్రి సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, తల్లి మార్గరెట్ జగనాటి. వీరి కూతురు పి.సింధూ సుబ్రహ్మణ్యం. అన్న మణిసుందరం హైదరాబాదులో బిజినెస్ వ్యవహారాలు చూస్తుంటారు. సొంత జిల్లా నెల్లూరు, పుట్టింది కడప. పెరిగింది హైదరాబాదు.

విద్యాభ్యాసం..

1వ తరగతి వరకు బంగ్లాదేశ్ రాజధాని ఢాకా. 4వ తరగతి నేపాల్‌లోని ఖాట్మండు, 5వ తరగతి హైదరాబాదు, 6 నుంచి 7వ తరగతి మదనపల్లె, 8, 9, 10 తరగతులు హైదరాబాదు చిన్మయ స్కూల్ బేగంపేట, ఇంటర్, డిగ్రీ హైదరాబాదు సెయింట్ మేరీస్ యూసుఫ్‌గూడా.

డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి దగ్గర ముఖ్య కార్యదర్శిగా పని చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి డా.పి. సుబ్రహ్మణ్యం. చిత్తూరు జిల్లాలో జరగాల్సిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి వెళ్లి 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఈ నేపథ్యంలో కుమార్తె పి.సింధు సుబ్రహ్మణ్యంకు 2019 జూలై 5న డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. మొదటి పోస్టు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు వేసింది. కోవిడ్ సమయంలో కాంట్రాక్టు ట్రేసింగ్‌లో పని చేసి ప్రశంసలు పొందారు. అనంతరం కోనసీమ జిల్లా అమలాపురం ఆర్‌డీవోగా పని చేశారు. వెయిటింగ్ స్టులో ఉన్న ఆమెను ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది.

వేగంగా ఫిర్యాదుల పరిష్కారం

హాస్పిటల్‌లో శానిటేషన్, సెక్యూరిటీ పెస్ట్, పార్కింగ్ అత్యవసర వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. ఇరవై నాలుగు గంటలు వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎవరైనా నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెడికల్ సర్జరీ, క్యాన్సర్ న్యూడయోగ్నస్టిక్ బ్లాకులను రెగ్యులర్‌గా తనిఖీ చేసి వాటికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. మినిస్టీరియల్ సిబ్బందికి వారు చూసే సెక్షన్‌కు సంబంధించిన ప్రతి ఫైల్‌పై అవగాహన ఉండాలన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్

- జడ్పీ సీఈవో జి. నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఉద్యోగులందరూ తప్పకుండా బయోమెట్రిక్ వేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. సోమవారం మిస్సింగ్ సిటిజెన్స్, ఎంఎస్ఎంఈ తదితర వాటిపై ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ జనవరి నుంచి సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయకపోతే ఫిబ్రవరి నుంచి జీతాలు చెల్లించడం కుదరదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సచివాలయ ఉద్యోగులంతా తప్పకుండా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,67,839 మంది సిటిజెన్స్ ఏ సచివాలయంలో కూడా నమోదు కాలేదన్నారు. అయితే వీరంతా ల్యాండ్ రికార్డ్స్ రైస్ కార్డు, ఆరోగ్యశ్రీలో వారి పేర్లు ఉండటంతోపాటు వివిధ రకాల ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నారని తెలిపారు. తక్షణమే వీరందరినీ సచివాలయాల్లో నమోదు చేయించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రైమరీ అగ్రికల్చర్‌కు సంబంధించి 73,462 మంది రైతులు వివిధ రకాల రుణాలు పొందుతున్నారని, వీరందరికి ఈకేవైసీ చేయించాలని అన్నారు. ఇప్పటి వరకు కేవలం 17 శాతం మాత్రమే ఈకేవైసీ చేయించారని వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 80,131 మంది చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు ఉన్నారని, వారందరినీ ఎంఎస్ఎంఈ కింద చర్పిస్తే ప్రభుత్వ నుంచి వివిధ రకాల ప్రయోజనాలు పొందుతారని అన్నారు. ఇప్పటి వరకు 8636 మందిని మాత్రమే చేర్పించరాని, మిగిలిన వారిని కూడా పూర్తి చేయాలని అన్నారు.



గడివేములలో చోరీ

- 8 తులాల బంగారు, రూ.13 వేల నగదు అపహరణ

గడివేముల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు పెద్దన్న ఇచ్చిన సమాచారం మేరకు.. పెద్దన్న కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా పెద్దన్న పనుల నిమిత్తం వెలుగోడు మండలానికి వెళ్లాడు. తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించిన దుండగులు చాకచక్యంగా తాళం తీసి బీరువాలోని 8 తులాల బంగారు, రూ.13 వేలు అపహరించారని అన్నారు. బాధితుడు దొంగతనం ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆదోనిలో పొద్దుటూరు వాసి మృతి

ఆదోని, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఇమామ్ (30) ఆదోనిలో మృతి చెంచాడు. వివరాల మేరకు.. మరో వ్యక్తి కూడా ఆదోనికి వచ్చి కోర్టు సమీపంలోని ఓ హోటల్లో భోజనం చేసి, ఖాళీ స్థలంలో కూర్చున్నారు. ఇంతలోనే ఏమైందో కింద పడిపోయాడు. మృతుడి వెంట వచ్చిన మరో వ్యక్తి పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం 5:30లోగా వస్తానని చెప్పినట్లు మృతుడి సోదరుడు బాషా తెలిపారు. స్థానికుల సమాచారంతో చేరుకున్న టూ టౌన్ ఎస్ఐ రామనాథ్ వివరాలను సేకరించి, మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి భార్య రేష్మ, ఇద్దరు కుమార్తెలు సంతానం. కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, గుంటూరు జిల్లాల్లో దొంగతనాలు, గ్యాంగ్‌రేప్‌లకు పాల్పడుతున్న చెంచుదాసరి సుంకన్న అలియాస్ తోల్లోడు అనే వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుడి వివరాలు వెల్లడించారు. నిందితుడు చెంచు దాసరి సుంకన్న స్వగ్రామం గడివేముల మండలం కరిమద్దెల అని తెలిపారు. నిందితుడు 2016 నుంచి ఇప్పటివరకు నంద్యాల జిల్లా, గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు, దోపిడీలు, గ్యాంగ్‌రేప్‌లకు పాల్పడ్డాడన్నారు. ఇతడి కోసం రెండు జిల్లాల పోలీసులు గాలిస్తున్నారని పేర్కొన్నారు. ఎట్టకేలకు నిందితుడిని సోమవారం ఉదయం 11గంటల సమయంలో నంద్యాల ఆటోనగర్ వద్ద అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 3 తులాల బంగారు నల్లపూసలదండ, 8గ్రాములు బరువు కలిగిన ఒక జత బంగారు కమ్మలు వీటి విలువ రూ.2.50 లక్షలు సీజ్ చేశామన్నారు. నిందితుడు తన అనుచరులతో కలిసి నంద్యాల చుట్టుపక్కల గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడి వచ్చిన సొమ్మును పంచుకునేవారని తెలిపారు. వీరు గతంలో నంద్యాల జిల్లాలోని నంద్యాల తాలుకా, పాణ్యం, మహానంది, పాములపాడు, బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 11దొంగతనాలు, రెండు దోపిడీల్లో పాల్గొన్నారన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినవారిలో సీసీఎస్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, ఇబ్రహీమ్, యేసుదాసు, పోలీస్ కానిస్టేబుళ్లు గంగారం, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నాగరాజు, మాలిక్‌బాషా, ఇస్మాయిల్ ఉన్నారు. వారిని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎన్.యుగంధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు

తల్లిదండ్రులే నిజమైన హీరోలు

- విశ్రాంత ఐజీ ఇక్బాల్



విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఇక్బాల్

పాణ్యం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిజ జీవితంలో హీరోలు మన తల్లిదండ్రులేనని విశ్రాంత రాయలసీమ ఐజీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. సోమవారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రూ. 25 వేల విలువైన క్రీడాసామాగ్రిని అందజేశారు. విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమా నటులను చూపి హీరోలు అనుకోవద్దని అన్నారు. సినిమాలు జీవితం కాదన్నారు. ఇతరులకు సహాయం చేయడం ద్వారా దేవుని ఆశీస్సులు లభిస్తాయన్నారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఐజీ ఇక్బాల్‌ను హెచ్‌ఎం జిలానిబాషా ఆధ్వర్యంలో సన్మానించారు.

నేడు 15 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 15 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని నేరుడుప్పల, నందవరం మండలం పెద్ద కొటిలికి, కౌతాళం మండలం లింగాల దిన్నె, ఆగసల గ్రామం, మంత్రాలయం మండలం నారాయణపురం, ఆదోని మండలం కుప్పగల్లు, బెలేకల్, హొళగుంద మండలం మూగమానుగొంది, కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓర్వకల్లు మండలం కన్నమడకల, కల్లూరు మండలంలోని కె. మార్కాపురం, వెల్దుర్తి మండలం బోగోలు, కర్నూలు రూరల్ పంచలింగాల, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో పత్తికొండ మండలంలోని పుచ్చకాయలమడ గ్రామం, ఆలూరు మండలంలోని ఎ. గోనేహాల్, ఆస్పరి మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామం మొత్తం 15 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని డీఆర్వో వెంకట నారాయణమ్మ తెలిపారు.

50 అర్జీలు స్వీకరణ..

జిల్లాలో సోమవారం ఐదు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. 50 అర్జీలు స్వీకరించామని డీఆర్వో తెలిపారు. ఆదోని డివిజన్‌లోని ఆదోని మండలంలో జాలిమంచి గ్రామంలో 5, పాండవగల్లులో 4, కర్నూలు డివిజన్ కర్నూలు అర్బన్‌లో 2, ఓర్వకల్లు మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో 33, కల్లూరు మండలంలోని రేమదూరు గ్రామంలో 6 అర్జీలు వచ్చాయన్నారు.

ఫిబ్రవరి 28 వరకు లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం సర్వీసు, ఫ్యామిలీ పింఛన్‌దారుల నుంచి లైఫ్ సర్టిఫికెట్లను జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో స్వీకరించనున్నట్లు జిల్లా ఖజానాధికారి రామచంద్రరావు తెలిపారు. ఆన్‌లైన్ బయోమెట్రిక్ విధానం, జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ అందించేందుకు జనవరి 1వ తేదీ నుంచి అన్ని ట్రెజరీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు.

యాక్షన్ ప్లాన్ రూపొందించండి

- కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాంలో అవార్డులు పొందిన మద్దికెర, చిప్పగిరి మండలాల అభివృద్ధికి జనవరి 31లోపు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడారు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాంలో మద్దికెర, చిప్పగిరి మండలాలు 2024 జూలై, సెప్టెంబరు త్రైమాసికాలకు సంబంధించి సౌత్ ఇండియాలో మొదటి స్థానంలో దేశంలో 18, 36 స్థానంలో ఉండి అవార్డులు సాధించాయన్నారు. ఈ అవార్డుల ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి చిప్పగిరి మండలానికి రూ.1.5 కోట్లు, మద్దికెర మండలానికి రూ.కోటి మంజూరు కావడం గొప్ప విషయమన్నారు. అందుకు కృషి చేసిన డీపీవో, జడ్పీ సీఈవో, డీఎంహెచ్‌వో, ఐసీడీఎస్ పీడీ, సీపీవో, చిప్పగిరి, మద్దికెర మండలాల ఎంపీడీవోలు, మండల, జిల్లా స్థాయి అధికారులందరికీ అభినందనలు తెలిపారు. ఇది శుభసూచకమని, ఇదే స్ఫూర్తితో అధికారులందరూ పని చేసి జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. వచ్చిన అవార్డు మొత్తానికి సంబంధించి రెండు మండలాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన పనులతో యాక్షన్‌ను రూపొందించాలని మద్దికెర, చిప్పగిరి మండలాల ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో జేసీ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కొండయ్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాశాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ-మెడికల్ అకాడమీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ మహానంది ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ పక్కీరప్ప, డాక్టర్ సుబ్బరాయుడు అందజేసిన ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఆమె ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఐ.శ్రీదేవి, డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, తహసీల్దారు కె.ఆంజనేయులు, ఎంపీడీఓ నాగేశ్వరచలరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, వనజ, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, లక్ష్మన్న, ఆంజనేయులు, శేషగిరి, జనసేన నాయకులు గంగాధర్, టీడీపీ నాయకులు ఈవీ.రమణ, వాకిటి మాదేష్, కురువ ధనుంజయ, వెంకటేశ్వర రెడ్డి, టి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

● **బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చిన్నటేకూరు గ్రామానికి చెందిన హుసేన్‌బాషాను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పరామర్శించారు. సోమవారం బాధితుడి ఆర్థిక సాయం అందజేశారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను కమిషనర్ స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్‌ఓ జునైద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● బాలాజీ నగర్‌లో డ్రైనేజీ మంజూరు చేయాలని 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి కమిషనర్ రవీంద్రబాబును కోరారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వార్డులోని సాయి ఎన్‌క్లేవ్ వద్ద సుమారు 30 ఇంటి సముదాయాలు ఉన్నాయని, డ్రైనేజీ లేకపోవడంతో నీరంతా బయటికి వస్తుందన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు.

సి.బెళగల్: జాయింట్ ఎల్‌పీ నెంబర్ల సమస్యలను పరిష్కరించాలని పోలకల్లు, గుండ్రేవుల గ్రామాల రైతులు ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తంను కోరారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 2,558 దరఖాస్తులు అందాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే మండలంలో గుండ్రేవుల, ఇనగండ్ల, కొండాపురం గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణెమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూల లీగల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కడప జిల్లాలో పోలీసు అధికారుల దుశ్చర్యలకు నిరసనగా స్థానిక న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతపురం మూడో పట్టణ పోలీసు అధికారుల వేధింపులతో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి గుండెపోటుతో స్టేషన్‌లోనే మృతి చెందాడని కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధానా కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా ఒక ప్రకటనలో తెలియజేశారు. కడప జిల్లా లక్కి రెడ్డిపల్లె పోలీసు అధికారులు మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్ రెడ్డిపై దురుసుగా ప్రవర్తించారని సంబంధిత పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరిగి పోతున్నాయని, న్యాయవాదుల పరిరక్షణకు వెంటనే చట్టాలను చేయాలని వారు ప్రకటనలో కోరారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో వచ్చిన రైతుల భూ సమస్యలను పరి ష్కరించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవా రం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులను వచ్చిన భూ సమస్యలకు సంబం ధించి అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి: ఎంపీడీవో

కోడుమూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇసుక అనుమతి విషయంలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో రాముడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామ, పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాలు, గృహ నిర్మాణాలకు ఇసుక అనుమతి ఇచ్చే సమయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం విధించిన స్పష్టమైన ఆదేశాలను పాటించి అను మతులు ఇవ్వాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి మాత్రమే అనుమతులు ఇచ్చి ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా ఇసుకను కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. హంద్రీ నదిలోని తాగునీటి పథకాలకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలన్నారు.

టీడీపీకి కార్యకర్తలే పునాది

గూడూరు డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాది అని పార్టీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని కె నాగలాపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జె సురేష్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందన్నారు.

ఎమ్మెల్యే పార్థసారథి జన్మదిన వేడుకలు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బిర్లాగేటులోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ఆసుపత్రిలో బీజేపీ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ అధికార ప్రతినిధి పీటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్టె చెన్నయ్య, ఉమామహేశ్వరప్ప, శ్రీరామ్ యాదవ్, ఖాన్, రమణ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తాం: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలో డ్రైనేజీల సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. సోమవారం లక్ష్మీపురం, రోజా వీధి, వెంకటరమణ కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. ఆయా కాలనీ ల్లో పార్కులు, డ్రైనేజీ, పైప్‌లైన్ లీకేజీలను పరిశీలించారు. లక్ష్మీపురంలో నీటి సరఫరాపై ఆరా తీశారు. వెంకటరమణ కాలనీలోని మంత్రి టీజీ భరత్ క్యాంపు కార్యాలయ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఎస్ఈ రాజశేఖర్, ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వర రెడ్డి, డీఈ గంగాధర్, ఏఈ నాగజ్యోతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్

ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు వర్తింపజేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో రిజర్వేషన్లు వర్తింపజేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు రంగంలోని వివిధ ప్రభుత్వ శాఖలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మెగా డీఎస్సీ నిరుద్యోగ భృతి హామీ పేపర్లకే పరిమితమైందన్నారు. ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా 16వ మహాసభల సందర్భంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ మీదుగా సీఆర్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పరుచూరి రాజేంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులైనా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపివేయాలన్నారు. విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ యువత పట్టుదల క్రమశిక్షణతో మెలగడం ద్వారానే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులను ప్రతి ఒక్కరికీ అందించడంలో నాడు కాంగ్రెస్, నేడు బీజేపీ పాలకులు విఫలమయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాముడు, జిల్లా కార్యదర్శి కారుమంచి, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు

పని వేళలు పాటించాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని, మధ్యాహ్న సమయంలో భోజనానికి రెండు గంటలు వెళ్లడం సరికాదని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సర్వజన వైద్యశాల ధన్వంతరీ హాలులో మినిస్ట్రీరియల్ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యంను సిబ్బంది పరిచయం చేసుకున్నారు. మధ్యాహ్న సమ యంలో భోజనానికి కొందరు మినిస్టీరియల్ సిబ్బంది రెండు గంటలు వెళ్తున్నారనీ, ఈ విషయాన్ని ఇటీవల ఆడిట్ నిర్వహించిన బృందం కూడా ఫిర్యాదు చేసిందని, ఇకముందు భోజనానికి కేటాయించిన సమయంలో వెళ్లి రావాలన్నారు. సదరం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కోరారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆసుపత్రిలో పలు విభాగాల్లో శానిటేషన్ సెక్యూరిటీ పని తీరు మెరుగుపరచాలన్నారు. సమీక్షలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి డా. సునీల్ ప్రశాంత్, ఏడీ రమేష్‌బాబు, ఏడీ శ్రీనివాసులు, ఆఫీసు సూపరిం టెండెంట్ లతీఫ్ బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

షెడ్యూల్ కులాలకు న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు బొందిమాడుగుల టీఎం రమేష్ మాదిగ కోరారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని షెడ్యూల్ కులాల్లో అక్రమంగా నమోదైన కురువ, రెడ్డి సామాజిక వారిని తొలగించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిడ్డయ్య, గోవిందు, ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి: తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సత్యాన్న మాదిగ సోమావారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

విజ్ఞానపీఠంలో అన్నదానం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని జీఎస్ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.నాగేశ్వరయ్య సోమవారం విజ్ఞాన పీఠంలోని అరక్షిత బాలలకు అన్నదానం చేశారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్ష అట్టలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎదుగుదలకు ఎంతో కృషి చేసిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత 14 ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జి.నాగేశ్వరయ్య సతీమణి జి.లక్ష్మిదేవి, జి. కావ్య, జి.చందన, జి. కౌష క్కృష్ణ, జి. వంశీ కృష్ణ, జీఎస్ఆర్ కుమార్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నాగేశ్వరయ్య దంపతులు

సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న కరణం కిషోర్ కుమార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): టూరిజం హరిత హోటల్‌లో ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంపా నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రెయిన్ ది ట్రైనర్ వర్క్‌షాపులో 35 మంది ట్రెయినర్లకు నెల రోజుల పాటు జూమ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్ షాపులో ప్రతిభ కనబరచిన పి.మాసుంబీకి ఐసీఐ సర్టిఫికెట్‌ను వినియోగదారుల ఫోరం కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ వర్క్‌షాపులో స్పీకింగ్ స్కిల్స్‌తో పాలలు వ్యక్తిత్వ వికాస అంశాలలో శిక్షణ ఇచ్చారు. రీజినల్ ప్రెసిడెంట్ కే. రవీంద్ర ధీర్, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ రామచంద్రుడు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాధవి, రీజనల్ సెక్రటరీ మహేంద్ర కోటకొండ, ఆఫ్‌లైన్ ప్రోగ్రాం ఇన్‌చార్జి గోపినాథ్, ఆన్‌లైన్ ఇన్‌చార్జి షేక్ పర్వీన్, దామోదర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరులో జరిగిన 68వ రాష్ట్రస్థాయి త్రోబాల్ క్రీడా పోటీల్లో నగర శివారులోని విజ్ఞానపీఠం హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడాశాఖ నిర్వహించిన పోటీల్లో జిల్లా టీమ్‌కు కెప్టెన్‌గా పాఠశాల విద్యార్థి శివ వ్యవహరించాడు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో జిల్లాకు మూడోస్థానం లభించింది. ఈ పోటీల్లో విద్యార్థులు శివ, శివశంకర్ తమ ప్రతిభ చాటగా, బాలికల విభాగంలో కుమారి ప్రతిభతో పతకం కైవసం చేసుకుంది. సోమవారం పాఠశాలలో ర్పాటు చేసిన అభినందన సభలో విజేతలను కరస్పాండెంట్ పీపీ గురుమూర్తి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వ్యాసరాజ్, వ్యా యామ ఉపాధ్యాయుడు రామిరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రమోహన్, సుదర్శనం, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వంశీరాఘవ, హిమాయత్ పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్‌లో కర్నూలు జట్టు విజయం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రికెట్ బాలుర చిత్తూరు జిల్లాపై కర్నూలు జట్టు 35 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. కర్నూలు జట్టు స్కోర్ 115/6 కాగా, రిత్విక్ కళ్యాణ్ 56 నాటౌట్, ధీరజ్ రెడ్డి 26 ఉన్నాయి. అలాగే చిత్తూరు స్కోరు 85/8గా నిలిచి, కర్నూలు బౌలర్లకు సహజాద్‌కు రెండు వికెట్లు, శ్రీవేంద్ర 2 వికెట్లు రిత్విక్ కళ్యాణ్‌లు ఒక వికెట్ తీశారు.

పెద్దాసుపత్రికి ఈసీజీ యంత్రాల విరాళం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఆదోని పట్టణానికి చెందిన దేశాయి నర్సింగ్ హోం అధినేత డాక్టర్ వాసంతి దేశాయి పరికరాలను విరాళంగా అందించారు. సోమవారం సూపరింటెండెంట్ చాంబరులో రూ.1.25 లక్షల విలువ చేసే రెండు సెక్షన్ ఆపరేటర్లు, మరో రెండు ఫిలిప్స్ ఈసీజీ మిషన్లను ఆయన హాస్పిటల్ సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లుకు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, సీతారామయ్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధుసుబ్రహ్మణ్యం, ఏడీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు కరెంట్ కోత ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంతో ష్‌నగర్, బళ్లారి రోడ్ సెక్షన్ల పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహనీయుల జయంతిని జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఓర్వకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మహనీయులు సావిత్రీ బాయి పూలే, ఫాతిమా షేక్‌ల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఓర్వకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాలలో కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షుడు అయ్యన్న మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమని సావిత్రీబాయి పూలే చెప్పారన్నారు. సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్‌ల జయంతి ఉత్సవాలను కర్నూలు జిల్లా పరిషత్ హాలులో ఈనెల 3వ తేదీన నిర్వహి స్తున్నట్లు వారు తెలిపారు. బాలకృష్ణ నాయక్, రాజు, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు



విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం నగర శివారులోని గోదా రంగనాథ స్వామి వారి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో వేకువ జామున 4.30 గంటలకు నిత్య ఆరాధన, రాత్రి స్వామి, అమ్మవార్ల పవళింపు సేవ నిర్వహించారు. తిరుప్పావై పాశురాల పఠనం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాలు ఆచరించారు. గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం పంపిణీ చేశారు. బళ్లారి రోడ్డులోని వై జంక్షన్ సమీపంలోగల వాసవినగర్ వేంక టేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా వేకువ జామున విష్ణు సహస్రనామ పారాయణాలు, గోవింద నామాలు, తిరుప్పావై పాశు రాలను పఠించారు. కార్యక్రమంలో యాలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో మాస శివారాత్రి పర్వదిన సందర్భంగా ఆలయంలోని భవానీ సమేత రామలింగేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ పాల్గొన్నారు.

పార్కు స్థలాలను కాపాడాలి



ఎంపీ బైరెడ్డి శబరికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కల్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో ఆక్రమణకు గురైన పార్కు స్థలాలను కాపాడాలని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ యజమానుల సంక్షేమ సంఘం నాయకులు ఎం.నాగరాజు కోరారు. సోమవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి కార్యాలయంలో కలిసి కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. 19వ వార్డులో లే అవుట్ నెంబరు 116-89లో మొత్తం మూడు పార్కులు దాదాపు 7.5 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయని వివరించారు. మాజీ ప్రజాప్రతినిధి అనుచరులమని పార్క్ స్థలాల్లో అక్రమంగా నివసిస్తున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీటీఎన్ఎంహెచ్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు డీఎంహెచ్‌వోను కోరారు. సోమవారం సాయంత్రం కొత్తగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.శాంతికళను తెలుగు నాడు వైద్య ఉద్యోగుల సంఘం కలిసి అభినందనలు తెలిపారు. డీఎంహెచ్‌వోను కలిసిన వారిలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఏ.మాదవరాజు, బి.చంద్రశేఖర్ నాయుడు, జిల్లా కోశాధికారి శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శాంతిలత, మధు సూదన్‌రావు, రోజ్ ప్రసన్న, చిన్నరాముడు, రామారావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

కర్నూల లీగల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ కళాశాల విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్, బాల్య వివాహాలు, ఉచిత న్యాయ సహాయంలపై వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, ఇన్‌స్టాగ్రామ్ రీల్ తదితర అంశాలపై ఈ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన రాయలసీమ యూనివర్సిటీ, పుల్లారెడ్డి డెంటల్ కళాశాల, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల, రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెమెంటోలను న్యాయాధికారి పంపిణీ చేశారు. రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినే టర్ నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి: ఎంఈవో

సి.బెళగల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదవాలని మండల విద్యాధికారి ఆదాం బాషా అన్నారు. సోమవారం ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆయన సందర్శించారు. అనంతరం పదో తరగతి విద్యార్థు లతో ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయం చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు రాముడు, ధనంజయుడు పాల్గొన్నారు.

న్యూయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

కోడుమూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ తబ్రేజ్ అన్నారు. స్థానిక సర్కిల్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ పరి ధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ఇందుకు లోబడి వేడుకలు జరుపుకో వాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10వేలు జరిమానా విధిస్తామన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కోడుమూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐకేపీ కార్యాలయంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంపీడీవో రాముడు హాజరై మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అనేక పథకాలను కల్పిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వికలాంగుల పింఛన్‌ను రూ.6వేల నుంచి రూ.10వేలు, రూ.15 వేలు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. అనంతరం ఇద్దరు విభిన్న ప్రతిభా వంతులకు వీల్‌చైర్‌ను ఎంపీడీవో రాముడు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల కమిటీ నాయకులు సురేష్, మద్దిలేటి, మక్బూల్, సూరి, రవి, వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, నాగేష్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మహేష్‌నాయుడు

కోడుమూరు, డిసెంబరు 30: కోడుమూరు మండల బీజేపీ అధ్యక్షుడిగా మహేష్‌నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తుల్జా భవాని కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సమావేశానికి బీజేపీ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీనాయుడు, అసెంబ్లీ కో కన్వీనర్ వేల్పుల గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మహేష్‌నాయుడును బీజేపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు షణ్ముఖాచారి, సురేంద్ర, అశోక్, విటల్, కిరణ్, కృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

కర్నూలు అర్బన్, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రక్తదానం చేయాలని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం క్లస్టర్ యూనివర్సిటీలో పరిధిలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని కోరారు. ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నిరు. రెడ్ క్రాస్ సొసైటి మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడంలో అపోహలను తొలగించారు. 35 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ ప్రసాదరెడ్డి, అధ్యాపకులు ఎస్ సవితా దేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాంటిస్సోరి పాఠశాలలో జన విజ్ఞాన వేదిక క్యాలెండర్‌ను సోమవారం ప్రిన్సిపాల్ మీనాక్షి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి కృషి చేస్తున్న ఏకైక సంస్థ జన విజ్ఞాన వేదిక అని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఖాజాహుశేన్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల పోటీలను మూడు అంశాల్లో నిర్వహిస్తున్నామని, ఇందులో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. జనవరి 26న సంబంధిత వీడియోలను పంపించవచ్చన్నారు. కార్యక్రమంలో సమతా కన్వీనర్ రమాదేవి, జేవీవీ యూత్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ పోరాటం

కర్నూలు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుందని వర్సిటీ కన్వీనరు రామక్రిష్ణ అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎస్ఎఫ్ఐ కో కన్వీనరు మౌలాలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని, ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, భరత్, నరేష్, నారాయణ, శివ, గణేష్, ప్రకాష్, ప్రతాప్, అశోక్, బాలాజీ, అనిల్, నరసింహ పాల్గొన్నారు.

మొక్కలు తీసుకురండి : ఎమ్మెల్యే

పత్తికొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనవరి 1న తనను కలిసేందుకు వచ్చే కార్యకర్తలు, నాయకులు మొక్కలు తీసుకురావాలని, పూల దండలు, బొకేలు, శాలువాలు తేవొద్దని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. సోమవారం మాట్లాడుతూ మొక్కలతో పర్యావరణానికి మేలు జరుగుతుందని, అనవసర ఖర్చులకు పోవద్దని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈ విషయంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ అవగాహన కల్పించాలని డిప్యూటీ ఈవో వెంకట రమణ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ నిర్వహించారు. సీఎమ్‌వో శివశంకర్, కేఆర్‌పీ విజయభాస్కర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పాఠశాలల అభివృద్ధిపై, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, డీఆర్పీలు సురేంద్ర బాపూజీ, బాలాజీ రావు, గౌస్ కాసిం బాషా, మహబూబ్ బాషా, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, హనుమంతు పాల్గొన్నారు.

తాగు నీరు సరఫరా చేయాలి



జొన్నగిరిలో తాగునీటి కోసం రాస్తారోకో చేస్తున్న నాయకులు

తుగ్గలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జియో మైసూరు కంపెనీ హంద్రీనీవా నుంచి వేస్తున్న పైపులైన్ల ద్వారా జొన్నగిరికి కూడా తాగునీరు సరఫరా చేయాలని కాంగ్రెస్, సీపీఎం మండల అధ్యక్షులు నాగార్జున, శ్రీరాములు, కొండారెడ్డి, టీడీపీ నాయకుడు నాగరాజు సోమవారం డిమాండ్ చేశారు. పైపులైన్ల కోసం పొలాలు ఇచ్చిన రైతులకు సాగునీరు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు గుంత హనుమన్న, వెంకటేశ్వర్లు, వీరన్న పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారికి ఉచిత శిక్షణ

ఆదోని టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో చేతి వృత్తుల వారికి ఉచిత శిక్షణ, ఉపాధి ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, టీవీ, ఫ్రిడ్జ్, గీజర్, ఏసీ తదితర వృత్తుల్లో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇస్తామని, ఆసక్తిగలవారు ఆధార్, పాన్ కార్డులతో మెప్మా కార్యాలయంలో జనవరి 5వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. సెల్ నంబరు 7901610344, 7901610375లలో సంప్రదించాలని కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

జనవరి 1 నూతన సంవత్సరం కావడంతో మంగళవారం పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. లబ్ధిదారులందరూ మంగళవారం ఇంటి వద్దనే ఉండి సచివాలయ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

సమస్యలను పరిష్కరించండి

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వినతి పత్రాలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1.పట్టణంలోని 19వ వార్డుకు చెందిన యశోద తాను టిడ్కో గృహానికి రూ.లక్ష డీడీ ఇచ్చానని, మంజూరు చేయాలని అర్జీ ఇచ్చారు.

2. దిబ్బనకల్లు సర్వేనెంబర్ 3/బీలో 3.75 ఎకరాలు ఉండగా రీ సర్వేలో 32సెంట్లు తక్కువగా చూపుతోందని న్యాయం చేయాలని ఆదోని మండలం నెట్టకల్లు గ్రామానికి చెందిన మల్లన్న అర్జీ ఇచ్చారు.

3. ఆదోని మండలం కపటి గ్రామానికి చెందిన లక్ష్మి తనకు సర్వే నెంబర్ 163లో 2.97 ఎకరాలు ఉండగా, రీ సర్వేతో 2.37మాత్రమే భూమి చూపుతోందని న్యాయం చేయాలని కోరారు.

4. సర్వే నెంబర్లు 38, 39లలో 4.09 ఎకరాలు ఉందని, సర్వే చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన రంగప్ప అర్జీ సమర్పించారు. సర్వేయర్లు శ్రీనివాస రాజు, వేణు సూర్య, డీఎల్‌పీవో నూర్జహాన్, హౌసింగ్ డీఇ రవి కుమార్, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ పాల్గొన్నారు.

నేషనల్ నర్సింగ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్: పటణంలోని నేషనల్ నర్సింగ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ కోశాధికారి శేఖర్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం విద్యార్థుల నుంచి అధిక వసూళ్లు చేస్తున్నారని, గతంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

● మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుకు నాయకత్వ లక్షణాలు వస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత నాగేంద్ర, ఎంఈవో రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో ఉజ్వల మిత్రమండలి ఆధ్వర్యంలోజోనల్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ క్రీడలకు దూరమమై, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. క్రీడలు కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, మున్సిపల్ హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ జడ్పీ హెచ్‌ఎం వెంకటస్వామి, కోసిగి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, పీడీ నరసయ్య, ఉజ్వల మిత్రమండలి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రహ్లాద, వెంకటేష్, నాగన్న, ఆంజనేయులు, హనుమంతు, కేశవ, రమేష్ పాల్గొన్నారు.

రేషన్ షాపు మార్చారని వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎం కొట్టాల దళిత నాయకులు

ఆలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొట్టాలకు రావలసిన రేషన్ షాప్ 25ను ములగవల్లికి మార్చారని దళిత నాయకులు రామాంజినేయులు, రాజు, చిట్టన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మాట్లాడుతూ గ్రామంలో ఎస్టీలే లేరని మరి, వారికి ఎలా కేటాయించారన్నారు. అనతరం పత్తికొండ ఆర్డీవో భారత్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు.

శాంతియుతంగా చేసుకోవాలి

ఆదోని రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా చేసుకోవాలని ఆదోని రూరల్ సీఐ నల్లప్ప సూచించారు. సోమవారం మాట్లాడుతూ యువకులు మద్యం తాగి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైలెన్సర్లు లేని వాహనాలను నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. రోడ్లపై కేకులు కట్ చేయరాదని, డీజేలకు అనుమతి లేదని సీఐ అన్నారు.

చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలి

ఆలూరు, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఇవ్వాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ కోరారు. ఎస్సీకి రిజర్వు కావడం హర్షణీయమన్నారు.

'మసాల' కుటుంబానికి అవకాశమివ్వండి

టీడీపీ అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే మసాలా ఈరన్న కుటుంబం నుంచి తనకు టీడీపీ అధిష్ఠానం అవకాశమివ్వాలని పార్టీ యువ నాయకుడు కొమ్ము రాజు కోరారు.

బాధ్యతతో ముందుకు సాగాలి

ఆలూరు, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులతో కలిసి బాధ్యతతో ముందుకు సాగాలని శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్ సూచించినట్లు జనసేన ఇన్‌చార్జి వెంకప్ప తెలిపారు. విజయవాడలో జనసేన కేంద్ర కార్యాలయంలో కర్నూలు జిల్లా జనసేన కో-ఆర్డినేటర్ చింత సురేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్‌తో పాటు ఆయనను కలిశామన్నారు.



పిడుగు హరిప్రసాద్‌తో జనసేన నాయకులు

టీడీపీ సభ్యత్వంతో భరోసా

మద్దికెర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని టీడీపీ నాయకులు బురుజుల చెన్నకేశవులు, కొత్తూరు శ్రీనివాసులు, రంగస్వామి అన్నారు. సోమవారం మండలంలోని బురుజుల గ్రామంలో సభ్యత్వాలు చేపట్టారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో సభ్యత్వాలు నిర్వహిస్తున్నామన్నారు.

పదోన్నతులు కల్పించాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి ఇవ్వాలని ఎస్టీయూ కౌన్సిలర్ అకాడమీ కమిటీ సభ్యుడు మహదేవప్ప డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండల నాయకుల సమావేశం నిర్వహించారు. జీవో 223ను రద్దుచేసి, ఏకీకృత సర్వీస్ రూల్స్‌తో సంబంధం లేకుండా పదోన్నతి ఇవ్వాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వం 1998, 2000, 2002లో పదోన్నతి ఇచ్చిందని, ఇదే ప్రభుత్వం 223 జీవో ద్వారా నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా కార్యదర్శి గోపాల్, అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ డీపీఆర్‌సీ సరెండర్ లీవ్స్ బకాయిలు చెల్లించాలన్నారు. రామాంజినేయులు, చింతకుంట రామకృష్ణ, సుధాకర్, సూర్యుడు, శిక్షావలి, ఆంజనేయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహదేవప్ప

నేడు డయల్ యువర్ డీఎం

పత్తికొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో పరిధిలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు సెల్‌నెం 9959225797కు ప్రజలు ఫోన్‌చేసి సమస్యలను తెలపాలన్నారు.

రేషన్ డీలర్లకు 262 దరఖాస్తులు

పత్తికొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో రేషన్ డీలర్ల దుకాణాలకు సంబంధించి 262 దరఖాస్తులు అందాయని ఆర్డీవో భరత్ నాయక్ సోమవారం తెలిపారు. 9 మండలాల్లో 45 దుకాణాలకు నోటిఫి కేషన్ ఇచ్చామన్నారు. దరఖాస్తులను 31న పరిశీలిస్తామని, అర్హుల జాబితా అదేరోజు ప్రచురిస్తామని, జనవరి 5న రాతతపరీక్ష ఉంటుందని 3వతేదీన హాల్‌టికెట్లు ఇస్తామని ఆర్డీవో అన్నారు.

పనుల పరిశీలన

తుగ్గలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిరిగిట్ల, పగిడిరాయి తదితర గ్రామాల్లో ఉపాధి పనులను సీఆర్‌డీ అధికారులు రాఘవేంద్ర, శేఖర్, వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, గోకులాల షెడ్ల పనులను పరిశీలించారు. పనుల నాణ్యతపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. కోర్సు డైరెక్టర్ ప్రదీప్ కుమార్, ఏపీవో హేమసుందర్, ఈసీ ప్రదీప్ కుమార్, క్లస్టర్ టీఏ వెంకప్ప, టీఏలు రామాంజనేయులు, ఫరీదప్ప, చంద్రశేఖర్, ఎఫ్ఏలు సతీష్ చౌదరి, రాము, చంద్రశేఖర్, గిరిగిట్ల మల్లి, బలరాముడు, మాదేష్, బోలా రవికుమార్, తదితరులు ఉన్నారు.

అబాకస్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

దేవనకొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అబాకస్ పరీక్షల్లో దేవనకొండ సరస్వతి, ఎఫ్ఆర్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదోని అక్షరశ్రీ పాఠశాలలో విశ్వం ఏడ్యుటెక్ సంస్థ నిర్వహించిన జిల్లాస్థాయి పరీక్షలల్లో ఎఫ్ఆర్ పాఠశాలకు చెందిన ప్రశాంత్, రూప, సరస్వతి పాఠశాలకు చెందిన ఇబ్రహీం విజేతలుగా నిలిచారు. జనవరి 9 న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్ననున్నట్లు హెచ్‌ఎంలు రఘునాథ్, క్రిష్ణమూర్తి తెలిపారు.

పనులు పూర్తి చేయాలి

మద్దికెర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ శేషయ్య సూచించారు. సోమవారం బస్టాండు నుంచి మెయిన్‌బజారు వరకు రూ.25 లక్షలతో చేస్తున్న పనులకు కొలతలు వేశారు. జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, సలహాదారులు బండారు ఆంజనే యులు కార్యదర్శి శివకుమార్, వెంకటేశ్వర రెడ్డి, రామాంజులు, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధం



మండలంలోని కైరుప్పల గ్రామ పొలాల్లో విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధగా ఉన్నాయి. కడ్డీలు తేలి, శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి, స్తంభాన్ని మార్చాలని రైతులు కోరుతున్నారు. - ఆస్పరి

ఎంపీడీవోపై దాడి అమానుషం



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఆలూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నాయకుల దాడి అమానుషమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షురాలు కె.శశికళ, రాజన్న, రవి బాబు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నిందితుడు సుదర్శన్ రెడ్డిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై దాడులు జరగ కుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవోను పరామర్శించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పద్మావతి, రవి కుమార్, దేవేంద్ర నాయక్, అశోక్, బాషా, మహేంద్ర కుమార్, రాజకుమార్ పాల్గొన్నారు.

అనర్హులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వొద్దు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని రూరల్ డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదాసి, మాదారి కురువలు లేరని, ఎస్సీ ధ్రువీకరణ ఇవ్వొద్దని దళిత సంఘం నాయకులు లక్ష్మీ నారాయణ, బాలాజీ, నరసన్న, కల్లుబోతుల రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం దళిత సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. బీసీలుగా ఉన్న కురువలు ఎస్సీ సర్టిఫికెట్ తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు ఆర్డీవో కార్యాలయం ముట్టడి

ఆలూరు: మాదాసి కురువ, మాదారి కురవలను కులగణనలో ఎస్సీలుగా నమోదు చేయవద్దని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, శేషగిరి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పార్థసారథి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు పట్టణంలోని ఎంసీహెచ్ వైద్యశాలలో పండ్లు పంపిణీ చేశారు. వెల్లాల మధుసూదన్ శర్మ, న్యాయవాది లోకేష్ కుమార్, పూల రఘు, మునిస్వామి, షేక్ షావలి, నబీ రసూల్ మురారి రఘు, కడిమెట్ల రామ కృష్ణ, సోడాల ఉరుకుందప్ప, అడ్వకేట్ చాంద్‌బాషా, శ్రీరాములు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి కారకులను సస్పెండ్ చేయాలి



పత్తికొండలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనంతపురానికి చెందిన న్యాయవాది శేషాద్రి మరణానికి కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. పోలీసుల చర్యలను నిరసిస్తూ న్యాయవాదులు విధులను బహిష్కరించి నాలుగు స్తంభాల కూడలిలో సోమవారం ఆందోళన చేశారు. కారప్ప మైరాముడు, మల్లికార్జున, సత్యనారాయణ, బాల్‌బాషా, నరసింహయ్య, కృష్ణ, దామోదరచారి, రాజశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

ఆదోని రూరల్/ అగ్రికల్చర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమీత్‌షా రాజీనామా చేయాలని సీపీఐ ఎంఎల్ జిల్లా ప్రధాన కార్య దర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం పట్టణం లోని శ్రీనివాస భవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్ షా ప్రవర్తించిన తీరు శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకప్ప, మణి, మహదేవమ్మా, అఖండ, మల్లికార్జున పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే రుణాలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● సహకార సంఘం ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ



ఆలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధన మేరకు ఈకేవైసీ చేయించుకున్న రైతులకే రుణాలు ఇస్తామని ఆలూరు వ్యవసాయ సహకార పరపతి సంఘ పర్సన్ ఇన్‌చార్జీ లక్ష్మీ నారాయణ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: సభ్యులు ఎంత మంది?

జవాబు: మొత్తం 2వేలకు పైగా రైతులు ఉన్నారు. ఆందులో 500 మందికి పైగా ఈకేవైసీ చేయించుకున్నారు. మిగతావారు 31 తేదీ రాత్రి లోగా చేయించుకోవాలి.

ప్రశ్న: ఈకే వైసీ లకుంటే కలిగే నష్టం?

జవాబు: సొసైటీలో సభ్యత్వం ఉన్నా, ఈకేవైసీ చేయించుకోకపోతే రుణాలు రావు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు, ఓటు వేసేందుకు అవకాశం ఉండదు.

ప్రశ్న: ఈ ఖరీఫ్‌లో రైతులకు రుణాలిచ్చారా?

జవాబు: రైతుల వివరాలు కంప్యూట రీకరణ చేస్తుండటంతో రుణాలు ఇవ్వలేదు. గత ఏడాది రైతు నేస్తం ద్వారా రుణాలు ఇచ్చాం.

ప్రశ్న: సొసైటీల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తున్నారు?

జవాబు: ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జీల పాలనను మరో 6నెలలకు పొడిగిస్తూ ఈనెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయానుసారం ఎన్నికలు ఉంటాయి.